యువత భవిత భద్రం

కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ అంధకారం

- ఓట్ల లెక్కింపు రోజు అందరూ సంయమనం పాటించాలి
- జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు
- విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చటం నిషిద్ధం
- సత్తెనపల్లి డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు
- సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని అందువల్ల వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు కోరారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలోని రాజకీయ నాయకులు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఓట్ల లెక్కింపు రోజున శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, నలుగురికి మించి సంచరించవద్దన్నారు. కౌంటింగ్ రోజున గ్రామాల నుంచి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర వ్యక్తులు పట్టణాలకు రావద్దని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లకు స్పందించవద్దన్నారు. జిల్లాలో జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరు సంయమనం పాటించాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చటాలు నిర్వహించరాదన్నారు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ రోజున, తర్వాత అల్లర్లు, గొడవలకు యువత దూరంగా ఉండాలన్నారు. రోడ్లపైకి వచ్చి గొడవల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే వారి బంగారు భవిష్యత్తు పాడవుతుందని తల్లిదండ్రులకు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు ఇప్పటికే బైండోవర్ కేసులు, అల్లర్లు, గొడవలు, విధ్వంసాలకు పాల్పడిన వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్, ఎస్‌ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, పోలీసులు సిబ్బంది, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



నకరికల్లు: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. పిల్లిపెసర, జనుము, జీలుగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేర్చి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. విత్తనాల మొలక శాతం పరీక్షించేందుకు నమూనాలు ల్యాబ్‌కు పంపామన్నారు. ల్యాబ్ రిపోర్టులు రాగానే పంపిణీ ప్రారంభిస్తామన్నారు. పిల్లిపెసర 54.8 క్వింటాళ్లు, జనుము 104.4 క్వింటాళ్లు, జీలుగ 114.5 క్వింటాళ్ల చొప్పున విత్తనాలు మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు పంపామన్నారు. పిల్లిపెసర కిలో రూ.134, జనుము కిలో రూ.88, జీలుగ కిలో రూ.88 ధర ఉందన్నారు. మార్కెట్ ధరలో 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

219 మందికి బీసీజీ టీకా



ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో 60 సంవత్సరాలు పైబడిన వారిలో 219 మందికి బీసీజీ టీకాలు అందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ గురువారం తెలిపారు. 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీకా అందించటం జరుగుతుందన్నారు. పొగతాగే వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ఎత్తు, బరువు నిష్పత్తిలో తేడా ఉన్న వారు, క్షయ వ్యాధిగ్రస్తులకు టీకా అందిస్తారన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న వారి కుటుంబసభ్యులకు అదనపు బీసీజీ టీకా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పీటర్‌డేమియన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాలకు యువత దూరంగా ఉండాలి



బొల్లవరం(ముప్పాళ్ల): మండలంలోని బొల్లవరం, రుద్రవరం, తురకపాలెం గ్రామాల్లో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు అదనపు బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజు ఎటువంటి ర్యాలీలకు, విజయోత్సవ సంబరాలకు అనుమతి లేదని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని అన్నారు. ముఖ్యంగా యువత వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులతో భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయని సూచించారు. పోలీసుల గస్తీ ఉంటుందని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఆయా గ్రామాల్లో పోలీసు అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్సై పి.హజరతయ్య, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన తప్పిపోయిన బాలిక



సత్తెనపల్లి: తప్పిపోయిన బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు పట్టణ పోలీసులు గురువారం చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో మూడేళ్ల చిన్నారి అటు ఇటు తిరగడాన్ని స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు బాలికను వెంట బెట్టుకొని పాతబస్టాండ్‌లోని గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వద్దకు తీసుకువెళ్లారు. అయినప్పటికీ ఆచూకీ లభించక విచారించుకుంటూ వెళుతున్న క్రమంలో ఓ పిల్లవాడు గుర్తించి సమాచారం ఇచ్చాడు. కాగా పట్టణంలోని వడ్డవల్లి పశు వైద్యశాల సమీపంలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు డాని, లక్ష్మిలను పిలిపించి బాలిక జ్ఞానసుందరిని అప్పగించారు. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు సూచించారు. తమ బిడ్డను సురక్షితంగా అప్పగించిన ఏఎస్ఐ సుబ్బారావును తల్లిదండ్రులు డాని, లక్ష్మిలతో పాటు పలువురు అభినందించారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

అమరావతి: మండల పరిధిలోని మల్లాది ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం, శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకుడు పరుచూరి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 40 అడుగుల అభయాంజనేయ స్వామికి పంచామృత స్నపన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. శనివారం ధ్యానాంజనేయస్వామి వారికి పంచామృత స్నపన, సహస్ర నామాలతో తమలపాకులతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నామ సంకీర్తన, మధ్యాహ్నం 12 గంటలకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులందరికి అన్న సంతర్పణ చేస్తున్నట్టు తెలిపారు.

లేమల్లెలో...

మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కార్యనిర్వాహకుడు వర్ల శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం నిడుముక్కల గ్రామానికి చెందిన పంచముఖ ఆంజనేయస్వామి హనుమాన్ చాలీసా భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం. ఉదయం 10 గంటలకు బృందావన చెక్క భజన కార్యక్రమం, 11 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభం, సాయంత్రం 6 గంటలకు సాయి సంగీత విభావరి వారిచే అన్నమాచార్య కీర్తనలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు హనుమజ్జయంతి వేడుకలలో పాల్గొనాలని ఆయన కోరారు.


మల్లాదిలో 40 అడుగుల ఆంజనేయస్వామి

60 ఏళ్లు పైబడిన వారికి క్షయవ్యాధి నివారణ టీకా

రాజుపాలెం: క్షయ వ్యాధి రాకుండా 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు గ్రామ సచివాలయానికి వెళ్లి టీకా వేయించుకోవాలని పల్నాడు జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ హనుమకుమార్ తెలిపారు. మండలంలోని కోటనెమలిపురి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ విధానాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు, షుగర్ వ్యాధి గ్రస్తులు కూడా టీకా వేయించుకోవాలని తెలిపారు. ఐదేళ్ల లోపు క్షయవ్యాధికి గురైన పిల్లలకు, 18 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారు వయస్సుకు తగ్గ బరువు లేని వారికి, పొగ తాగే అలవాటు ఉన్నవారికి క్షయవ్యాధి గ్రస్తులకు, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం అన్ని గ్రామ సచివాలయలలో ప్రతి గురువారం జరుగుతుందని తెలిపారు. మూడు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ ప్రియదర్శిని, ఏఎన్ఎంలు మేరి, శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


క్షయవ్యాధి రాకుండా టీకా వేస్తున్న సిబ్బంది

రేపు హనుమజ్జయంతి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): హనుమజ్జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయస్వామి, దక్షిణ బజారులోని గమిడి ఆంజనేయస్వామి, పుట్టాబత్తుని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. స్వామికి లక్ష తమలపాకుల పూజ, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టనున్నారు. అన్న సంతర్పణ కార్యక్రమాలు ఉంటాయని ఆయా ఆలయాల కమిటీల సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి వేడుకలు

నాదెండ్ల: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో గురువారం వేడుకలు ప్రారంభమయ్యాయి. గణపవరం – కావూరు డొంక రోడ్డులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో, రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన కోదండరామాలయంలో, శాంతి నగర్‌లోని కోదండరామాలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్, ఉమామహేశ్వరశర్మ పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలకు గణపతిపూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, 9 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర, తమలపాకులతో విశేషహారతి నిర్వహించారు.


గణపవరం కోదండరామాలయంలో..

నూజెండ్లలో నగరోత్సవం

వినుకొండ(నూజెండ్ల): హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా నూజెండ్ల గ్రామంలో ఆంజనేయస్వామి దీక్షదారులు గురువారం నగరోత్సవం నిర్వహించారు. శనివారానికి 41 రోజులు పూర్తి చేసుకొని, హనుమత్ వ్రతం ఇరుముడులు కట్టుకొని జాపాలి క్షేత్రం వెళ్లే సందర్భంగా భిక్షాటన, హరేరామ సంకీర్తనతో గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామాల్లోని అన్ని దేవాలయాల్లోని దేవతా మూర్తులకు అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసరావుపేట: మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి గురువారం 26వ వార్డు చెరువుగట్టు శివాలయం బజార్, 31వ వార్డు బరంపేట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆ వార్డుల్లో నిర్వహిస్తున్న శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. శివాలయం వద్ద మేజర్ డ్రైయిన్‌లో కరెంటు స్తంభానికి సంబంధించిన సైడ్ దిమ్మ పడడం వల్ల డ్రైయిన్‌లో చెత్త నిలిచి ఉండడం గమనించారు. సంబంధిత శానిటేషన్ అధికారులను జేసీబీ ద్వారా వాటిని తొలగించి, నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టరు రామకోటయ్య, వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజినీర్ రాము నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రైయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనరు రవిచంద్రారెడ్డి

చెరుకూరి సృజనకు నాట్స్ సంస్థ సేవా పురస్కారం




యడ్లపాడు: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ చెరుకూరి సృజనకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి, అందించే అరుదైన ఈ పురస్కారాన్ని గురువారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాట్స్ అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. 30 మంది ఉపాధ్యాయులకు, ఐదుగురు కవులకు, పలు కళలకు చెందిన కళాకారులకు, 100 మంది జానపద కళాకారులతో పాటు ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని సృజన తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

యడ్లపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిధిలోని బుధవారం రాత్రి అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకు చెందిన పుల్లగూర అంజమ్మ(70) గుడారాల పండుగకు వెళ్లేందుకు వాహనం కోసం 16వ నంబర్ జాతీయ రహదారిపైకి వచ్చింది. అదే సమయంలో వేగంగా దూసుకువచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొబైల్ దుకాణంలో చోరీకి విఫల యత్నం



నాదెండ్ల: సెల్‌ఫోన్ దుకాణంలో ఓ దుండగుడు చోరీకి యత్నించి విఫలమైన ఘటన గణపవరం గ్రామంలో గురువారం వెలుగులోకొచ్చింది. షాపు యజమాని పోలూరి శరత్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామ మెయిన్ రోడ్డులో శ్రీలక్ష్మి సాయి సెల్‌షాపు నిర్వహిస్తున్నానన్నాడు. బుధవారం రాత్రి 9 గంటలకు షాపు మూసివేయగా.. గురువారం ఉదయం చూడగా.. షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా రాత్రి 1.45 గంటలకు తాళాలు పగలగొట్టి లాకులు తీసేందుకు యత్నించిన విఫలమైనట్లు రికార్డు అయ్యిుండటాన్ని గుర్తించి నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో వైస్ ఎంపీపీ లక్ష్మి మృతి

నరసరావుపేట రూరల్: అనారోగ్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అల్లూరివారిపాలెం ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ యాంపాటి లక్ష్మి(41) గురువారం మృతి చెందారు. సోమవారం సల్ప అస్వస్థతకు గురైన ఆమెకు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వైఎస్ ఎంపీపీ లక్ష్మి మృతిచెందారు. మృతదేహాన్ని గురువారం రాత్రి అల్లూరివారిపాలెంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. లక్ష్మి మృతదేహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు.

వైభవంగా శివ కల్యాణం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శివ కల్యాణం వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం పవళింపు సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీవాసవి అమ్మవారి మూల విరాట్‌కు విశేష అభిషేకాలు జరిపి, ప్రత్యేక అలంకరణలు గావించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు.

జూన్ 2 నుంచి 5 వరకు దుకాణాలు మూసివేయాలి

- పాలు, కూరగాయలు, మెడికల్ దుకాణాలకు అనుమతి
- సత్తెనపల్లి డీఎస్పీ గుర్‌నాథ్ బాబు



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకొని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి 5 వరకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో అన్ని దుకాణాలను మూసివేసి పోలీసులకు సహకరించాలని సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు గురువారం కోరారు. అత్యవసరమైన పాలు, పెరుగు, కూరగాయలు, మెడికల్ దుకాణాలు మినహా ఇతర ఏ దుకాణాలు తెరవరాదన్నారు. అత్యవసర దుకాణాల వద్ద కూడా ఎక్కువ మంది ఉండటానికి వీల్లేదని, ఒకరి వెంట ఒకరు తీసుకొని వెంటనే వెళ్లిపోవాలన్నారు. అలా కాకుండా రోడ్లపై తిరుగుతూ గుంపులుగా నిలబడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని, జూన్ 6 వరకు సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. జూన్ 5 వరకు దుకాణాలు తెరవరాదని, 144 సెక్షన్ పక్కాగా అమలు పరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు శిక్షణ

క్రోసూరు: జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదేశానుసారం, క్రోసూరు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మండల విద్యా శాఖ కార్యాలయంలో క్రోసూరు మండల విద్యా శాఖ అధికారులు వై.ప్రసాదరావు, ఎం.గణేష్ అధ్యక్షతన గురువారం శిక్షణ, వంటల పోటీలు నిర్వహించడం జరిగింది. శిక్షణలో భాగంగా విద్యార్థులకు అందించే ఆహారంలో కచ్చితంగా అందించవలసిన పోషకాలు అనగా కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, ఫ్యాట్స్, విటమిన్స్, మినరల్స్, వాటి ఆవశ్యకతను తెలియజేశారు. అదే విధంగా పోషకాలు సరిపడా మోతాదులో అందకపోతే విద్యార్థులకు ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, వంట చేసేటప్పుడు పోషకాలు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాలు ఎలా అందించబడుతున్నాయో పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. వంటలను రుచికరంగా చేయాలని అన్నారు. ఈ సందర్భంగా స్టేట్ లెవల్‌లో ట్రైనింగ్ పొందిన రిసోర్స్ పర్సన్ వెంకాయమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన కొన్ని ముఖ్య సూచనలు, సలహాలు అందించారు. తదుపరి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వంట ఏజెన్సీల సభ్యులు పాల్గొన్నారు.


వంటలను పరిశీలిస్తున్న ఎంఈవోలు వై.ప్రసాదరావు, ఎం.గణేష్

ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగులను గురువారం ప్రత్యేకించి సత్కరించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు షేక్ కరీముల్లా (726102), జి.గోపి (728453), టార్గెట్ ఎర్నింగ్ పైన అత్యధిక అచీవ్‌మెంట్ చూపిన ముగ్గురు కండక్టర్లు టీపీ శివయ్య (727800), షేక్ షంషుద్దీన్(728906), సీహెచ్ కోటయ్య (727178)లను ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలతో సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రతి ఉద్యోగి తమ లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఆదర్శ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న ఉద్యోగులతో ఆర్టీసీ డీఎం కుమార్, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు

అలుపెరుగని పోరాట యోధుడు కామ్రేడ్ వెంకటపతి

సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య

సత్తెనపల్లి: అలుపెరుగని పోరాట యోధుడు సత్తెనపల్లి మాజీ శాసన సభ్యుడు, కామ్రేడ్ పుతుంబాక వెంకటపతి అని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పుతుంబాక వెంకటపతి వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి ప్రాంత సీపీఎం పార్టీ నిర్మాణానికి కామ్రేడ్ వెంకటపతి కృషి చేయడమే కాక ఉమ్మడి గుంటూరు జిల్లాలో పటిష్టమైన పార్టీ నిర్మాణానికి కృషి చేశారన్నారు. పార్టీలో చురుకైన కార్యకర్తలను తయారు చేయడానికి తగిన ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. నేడు దేశంలో ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన సాగుతుందన్నారు. మోదీ పతనంతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. ముస్లింలను సంతాన ఉత్పత్తి కేంద్రాలుగా, దేశంలోని హిందూ ఆడవాళ్ల తాళిబొట్లు అమ్మి ముస్లింలకు కాంగ్రెస్ కట్టబెడుతుందని ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మోదీ దుర్మార్గాలకు పాల్పడుతున్నప్పటికీ రాష్ట్రంలో ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు మౌనం వహిస్తున్నాయన్నారు. ముందుగా వెంకటపతి చిత్రపటానికి రైతు సంఘం సీనియర్ నాయకులు గుంటూరు వేమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పుతుంబాక వెంకటపతి స్మారక స్థూపానికి సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.ఆంజనేయ నాయక్, నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, కట్టా శివ దుర్గారావు, గుంటూరు మల్లేశ్వరి, గుంటుపల్లి రజని, పెండ్యాల మహేష్, గద్దె ఉమాశ్రీ, పొట్టి సూర్యప్రకాశరావు, జడ రాజకుమార్, దుగ్గి మేరమ్మ, మక్కపాటి నరసింహారావు పాల్గొన్నారు.


పుచ్చలపల్లి విజ్ఞాన కేంద్రంలో వెంకటపతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాఠశాలల్లో పసందైన భోజనం

వంట ఏజెన్సీల వారికి శిక్షణ

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) ను విద్యార్థులకు మరింత రుచిగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జూన్ 12న పాఠశాలలు తెరుస్తున్నందున విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసేలా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీల వారికి మరింత రుచిగా వంట ఎలా తయారు చేయాలనే దానిపై గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. దీనిలో భాగంగా గురువారం మండల విద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావుల ఆధ్వర్యంలో అబ్బూరు గ్రామానికి చెందిన రిసోర్స్ పర్సన్ శివమ్మ శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంట తయారీలో పాల్గొంటున్న కుక్, హెల్పర్లను ఈ ప్రత్యేక శిక్షణలో భాగస్వాములు చేశారు. ఇందులో భాగంగా నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


బహుమతి అందిస్తున్న ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు